క్లుప్తంగా

కాకాణి గోవర్ధన్‌రెడ్డి అరెస్ట్‌ను ఖండించిన బన్నీ

కనిగిరిరూరల్: మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి అక్రమ అరెస్టును పీడీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి(బన్నీ) మంగళవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఎవరో చెప్పిన అబద్ధపు వాంగ్మూలంతో అరెస్ట్ చేయడం తీవ్ర దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. పోలీస్ శాఖ బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఇలాంటి సంస్కృతి మంచి పద్ధతి కాదన్నారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి పై పెట్టిన అక్రమ కేసు పట్ల వైఎస్సార్‌సీపీ చట్ట బద్ధంగా, న్యాయ పోరాటం చేస్తోందన్నారు. ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నిస్తే ప్రతిపక్ష పార్టీల నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నా రన్నారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అప్రజాస్వామిక చర్యలను ప్రజలను గమనిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా అక్రమ కేసులు నమోదు చేయడాన్ని బన్నీ తీవ్రంగా ఖండించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి


మాట్లాడుతున్న పంచాయతీ విస్తరణ అధికారి హనుమంతరావు

హనుమంతునిపాడు: గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ విస్తర ణాధికారి హనుమంతరావు అన్నారు. స్థానిక కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ఇంటి పన్నులు నూరుశాతం వసూలు చేయాలన్నారు. కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

దివ్యాంగుల సర్వే పరిశీలన


సర్వేను పరిశీలిస్తున్న ఎంఈఓ

పీసీపల్లి: మండలంలో ఈ నెల 13 నుంచి నిర్వహిస్తున్న దివ్యాంగుల సర్వే కార్యక్రమాన్ని ఎంఈఓలు సంజీవ్, ఆర్ శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాల్లో దివ్యాంగులను గుర్తించి సర్వేలో నమోదు చేయాలని, ఇంకా గ్రామాల్లో ఎవరైనా మాటలు, వినికిడి, మంద బుద్ధి కలిగిన పిల్లలు ఉంటే ఐఆర్‌టీ టీచర్‌ను సంప్రదించాలన్నారు. మండలంలోని దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కేంద్రం ఏర్పాటుకు పాఠశాల భవనాల పరిశీలన


భవన పరిశీలన చేస్తున్న జిల్లా ఐఈ కో ఆర్డినేటర్ నాగేంద్ర

కనిగిరిరూరల్: మండలంలోని కంచర్లవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేయనున్న 'ఆ టిజం' కేంద్రం నిర్వాహణ భవన తరగతి గదులను జిల్లా సమగ్ర శిక్ష , సహిత విద్య సమన్వయ కర్త, ఐఈ కో ఆర్డినేటర్ పి.నాగేంద్ర మంగళవారం పరిశీలించారు. అనంతరం పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయ సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఐఈ ఆర్పీలు ప్రత్యేక విద్యార్థుల గుర్తింపు, పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పరిశీలించారు. ఎంఈఓలు డీవీ సుబ్బారావు, యువీ నారాయణరెడ్డి, హెచ్ఎం విజయభాస్కర్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ మల్లెల పిచ్చయ్య, ఐఈఆర్పీలు ఎం సైమన్, కెగోపాల కృష్ణయ్య, ఎస్‌డీ మాలిక్ మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి


ఆధార్ నమోదు చేసుకుంటున్న యువకులు

సింగరాయకొండ: మండలంలోని మూలగుంటపాడు–2 గ్రామ సచివాలయంలో ఈ నెల 26వ తేదీ సోమవారం నుంచి నెల్లూరు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఆధార్ సెంటర్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ డి. జయమణి అన్నారు. ఆధార్‌సెంటర్ 10 రోజుల పాటు మూలగుంటపాడు–2 సచివాలయంలో, మరో 10 రోజుల పాటు ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో అందుబాటులో ఉంటుందని వివరించారు. సెంటర్‌లో నూతన ఆధార్‌కార్డు నమోదు, ఆధార్ కార్డులో మార్పులు చేర్పులు చేస్తారని, ఇందుకోసం ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. సెంటర్‌లో డేటా ఆపరేటర్‌గా టి.చెంచురామారావు వ్యవహరిస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె వివరించారు.

పేరులో గొప్ప.. ఊరంతా డ్రైనేజీల దిబ్బ!

- ఉలవపాడులో అధ్వానంగా డ్రైనేజీలు
- పూడిక తీయకపోవడంతో రోడ్లపై మురుగు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు


వడ్డెపాలెం డ్రైనేజీ అంబేడ్కర్‌నగర్ రోడ్డు మీదపారుతున్న డ్రైనేజీ


డ్రైనేజీలో పేరుకుపోయి వ్యర్థాలు


డ్రైనేజీలో మొలిచిన చెట్లు

ఉలవపాడు:

పేరుగొప్ప.. ఊరుదిబ్బ అన్న చందంగా తయారయింది ఉలవపాడు గ్రామ పంచాయతీ పరిస్థితి. పంచాయతీ పరిధిలో ఏ వీధి చూసిన డ్రైనేజీ వ్యవస్థ దారుణంగా ఉంది. మేజర్ పంచాయతైన ఉలవపాడులో 16 మంది పారిశుధ్య కార్మికులు వారి చేత పనిచేయించడానికి ఇద్దరు మేస్త్రీలు ఉన్నారు. వీరు కాక డ్రైనేజీలను శుభ్రం చేయడానికి బయట నుంచి కార్మికులను కూడా తీసుకుని వచ్చి పనిచేయిస్తున్నారు. కానీ డ్రైనేజీ వ్యవస్థ మాత్రం అధ్వానంగా ఉన్న పరిస్థితి నెలకొంది. డ్రైనేజీలు నిండిపోయి మురికి నీరు రోడ్ల పైకి వస్తోంది. ప్రధానంగా ఉలవపాడు మెయిన్‌రోడ్ డ్రైనేజీ అస్తవస్తంగా ఉంది. ఇక వడ్డెరపాలెం మొదటి బజారులో ఉన్న డ్రైనేజీ పూర్తిగా నిండిపోయి అంబేడ్కర్ నగర్ రోడ్డు మీదకు మురికి నీరు వచ్చేసింది. వడ్డెరపాలెం ప్రధాన డ్రైనేజీ పూర్తిగా ధ్వంసమైంది. ఇటీవల వడ్డెరపాలెంలో డ్రైనేజీ వ్యవస్థ బాగోలేదని ఆరు నెలల నుంచి మురుగు తీయలేదని మహిళలు పంచాయతీ కార్యదర్శిని నిలదీశారు.

పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం వలనే..

గ్రామ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి వచ్చిందని ప్రజలు బాహాటంగా ఆరోపిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి అందుబాటులో ఉన్న సిబ్బందిని సక్రమంగా వినియోగించుకోక పోవడం వలనే డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయని విమర్శిస్తున్నారు. రాజకీయ కోణంలో అధికారపార్టీలోని రెండు వర్గాలు పోటీపడి ఎమ్మెల్యే ద్వారా చెప్పించి ఇద్దరు మేస్త్రీలను నియమించారు. ఈ ఇద్దరి మధ్య సమన్వయం లేకపోవడం కార్మికులను ప్రతిరోజూ ఎక్కడికి పంపాలో సరైన నిర్ణయం లేకపోవడం వలన పరిస్థితి ఇలా మారింది. బజార్లు ఊడవటం తప్ప డ్రైనేజీలు తీయడంపై శ్రద్ధ పెట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పంచాయితీ పరిధిలో డ్రైనేజీలు శుభ్రం చేయాలని కోరుతున్నారు. రోడ్ల పైకి మురుగు రావడం వలన దుర్వాసన వస్తుందని వాపోతున్నారు. వర్షాలు కూడా పడే అవకాశం ఉండడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది కావున డ్రైనేజీలు శుభ్రం చేయాలని కోరుతున్నారు.

తిరునాళ్ల ప్రశాంతంగా నిర్వహించుకోవాలి


మాట్లాడుతున్న సీఐ భీమానాయక్, ఎస్సై

సీఎస్‌పురం(పామూరు): వడ్డెపాలెంలో ఈనెల 30వ తేదీ నుంచి జూన్ 5వ తేదీవరకు నిర్వహించనున్న పెద్దమ్మతల్లి తిరునాళ్ల ప్రశాంతంగా జరిగేందుకు అందరూ ఐకమత్యంతో ముందుకు పోవాలని సీఐ ఎం భీమానాయక్ అన్నారు. పెద్దమ్మతల్లి తిరునాళ్లపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై ఆర్.సుమన్ అధ్యక్షతన అన్ని సామాజికవర్గాల నాయకులు, ఆలయ కమిటీసభ్యులు, పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తిరునాళ్ల సందర్భంగా చిన్నపాటి వివాదాలు, అల్లర్లు సృష్టించినా వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అన్ని వర్గాలవారు సమన్వయంలో ఉండి తిరునాళ్ల విజయవంతం చేసుకోవాలన్నారు. కవ్వింపు చర్యలకు పాల్పడినా, ఘర్షణ వాతావరణం సృష్టించినా ఉపేక్షించేది లేదని, ప్రత్యేక పోలీస్‌బందోబస్తు ఏర్పాటుచేస్తున్నట్లు, పోలీస్ సిబ్బందికి అందరు సహకరించాలన్నారు. వడ్డెరసంఘం నాయకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.,

యోగాతో శారీరక సామర్థ్యం


కొండపి: యోగాసనాలు వేస్తున్న సచివాలయ సిబ్బంది


పీసీపల్లిలో యోగా చేస్తున్న అధికారులు, నాయకులు

కొండపి: యోగా శారీరక సామర్థ్యాన్ని పెంచుతుందని ఎంపీడీవో రామాంజనేయులు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో భవన సమావేశ హాలులో ఏర్పాటు చేసిన యోగా శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి జీవితంలో యోగా ఎంతో ముఖ్యమని, రోజూ యోగా చేస్తే మనిషి ఆరోగ్యంగా ఉంటాడన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఒత్తిడితో హాస్పటల్ పాలో అవుతున్నారని, అనారోగ్య సమస్యలు నయం చేసుకోవడానికి ఎంతో ఖర్చులు చేస్తున్నామని, యోగాతో కొంతవరకు మన ఆరోగ్యం మనమే కాపాడుకోవచ్చన్నారు. యోగా ట్రైనర్లుగా గుండా హరి, కొణిజేటి సత్యనారాయణ వ్యవహరించారు. కె.ఉప్పలపాడు, వెన్నూరు, చోడవరం సచివాలయ సిబ్బంది, ఎంపీడీవో ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొండపి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో రోజూ ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు యోగ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రామాంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం గోగినేనివారిపాలెం, పెరిదేపి, నేతివారిపాలెం, గురువారం కొండపి 1,2, పెద్దకండ్లగుంట, శుక్రవారం అనకర్లపూడి, చిన్నకండ్లగుంట, శనివారం పెట్లూరు, మూగచింతల, వెన్నూరుపాడు సచివాలయ సిబ్బంది ఆయా గ్రామాల్లో యోగా ట్రైనర్లతో సహా శిక్షణ తరగతులకు హాజరు కావాలన్నారు. శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.

పొన్నలూరు: రోజూ క్రమం తప్పకుండా యోగా చేస్తే మంచి ఆరోగ్యం పొందొచ్చని ఎంపీడీఓ డాక్టర్ సుజాత అన్నారు. స్థానిక జెడ్పీ పాఠశాల ఆవరణంలో మంగళవారం యోగాంధ్ర–2025 మాసోత్సవాల్లో భాగంగా యోగాసనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత పొందాలంటే యోగా చేయాలన్నారు. మన జీవన ప్రయాణంలో యోగాసనాలు భాగం చేసుకోవాలన్నారు. గ్రామస్థాయి అధికారులు ఆయా గ్రామాల్లోని ప్రజలకు యోగాసనాలపై అవగాహన కల్పించాలని తహసీల్దార్ పుల్లారావు అన్నారు. ఎంఈఓ రవిచంద్రబాబు, డాక్టర్ రవి కిరణ్, ఏపీఓ సుధాకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

హనుమంతునిపాడు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీఓ ఎం రంగసుబ్బరాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన యోగాపై అవగాహన కల్పించారు. అనంతరం శిక్షకులు షేక్ జిలానీబాషా, ఆయుర్వేదిక్ వైద్యులు డాక్టర్ అవినాష్‌రెడ్డిలు సిబ్బందికి, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఈఓఆర్డీ హనుమంతరావు, సీనియర్ అసిస్టెంట్ గోనా రమేష్, సిబ్బంది, పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో ఎంపిక చేసిన యోగా ట్రైనర్లకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో యోగాపై సి.నాగులవరం పీఈటీ షేక్.నాయబ్‌రసూల్ శిక్షణ ఇచ్చారు. నిత్యం యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమన్నారు. శిక్షణ పొందిన ట్రైనర్స్ సచివాలయ స్థాయిలో అందరికీ శిక్షణ ఇవ్వాలన్నారు. పీఎస్‌లు వి.బ్రహ్మానందరెడ్డి, జి.వాణిరెడ్డి, వీపీఏలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పీసీపల్లి: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రభాకర్ శర్మ యోగాపై అవగాహన కల్పించారు. యోగాతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. సంజీవన్, శ్రీనివాసులు, మాస్టర్ ట్రైనింగ్ ప్రసాదు, ఏపీఓ జహంగీర్ బాష, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పామూరు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని డాక్టర్ గేద్దే ఏడుకొండలు, ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య అన్నారు. స్థానిక సచివాలయంలో మంగళవారం మండలంలో ఎంపికైన యోగా ట్రైనర్స్‌కు శిక్షణ నిచ్చారు. మండలస్థాయిలో శిక్షణ పొందిన వారు జూన్ 3, 4, 5 తేదీల్లో సచివాలయ పరిధిలో యోగాపై శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఈఓపీఆర్‌డీ గవిరెడ్డి అరవిందారెడ్డి, కేఎల్ శ్రీనివాసరావు, యోగా ట్రైనర్స్ పాల్గొన్నారు.

సింగరాయకొండ: యోగాతో ప్రజలు ఆరోగ్యంగా ఉండటమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకోసం ప్రతి ఒక్కరూ యోగా చేయడమే లక్ష్యంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు ఎంపీడీఓ డి.జయమణి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ జయమణి మాట్లాడుతూ మండల స్థాయిలో నాలుగు రోజుల పాటు శిక్షణ ఇస్తారని, ఆ తర్వాత ఇక్కడ శిక్షణ పొందిన వారు గ్రామ సచివాలయం పరిధిలో శిక్షణ ఇచ్చి జూన్ 21వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయ పరిధిలో నిర్వహించే యోగా డేలో పాల్గొనేలా కృషి చేస్తున్నామన్నారు. ఇందుకోసం సచివాలయ సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి యోగా డేలో ఎవరు పాల్గొంటారో తెలుసుకుని వారి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉందని వివరించారు. ఎంఈఓ–1 కత్తి శ్రీనివాసరావు, ఎంఈఓ–2 ఆవుల శ్రీనివాసులు, పీడీ మాల్యాద్రి పాల్గొన్నారు.


హెచ్ఎంపాడులో యోగా శిక్షణ తరగతులు


పామూరులో యోగా ట్రైనర్స్‌కు శిక్షణ


పొన్నలూరులో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ సుజాత


యోగా శిక్షణలో అధికారులు

గృహ నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి


గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న డీజీఎం అన్నపూర్ణ

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏర్పాటైన జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని గృహనిర్మాణ శాఖ డీజీఎం ఎన్.అన్నపూర్ణ సూచించారు. మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీ పకీరుపాలెం సమీపంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన–ఎన్టీఆర్ నగర్‌ను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్నపూర్ణ మాట్లాడుతూ లేఔట్‌లో సుమారు 1600 ప్లాట్లు ఉండగా వాటిలో 663 ప్లాట్లకు గృహాలు నిర్మించుకునేందుకు నిధులు మంజూరు కాగా కేవలం 166 ప్లాట్లలో గృహ నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగిలిన 497 ప్లాట్లలో గృహ నిర్మాణాలు వివిధ దశలో ఉండటంపై ఆమె విస్మయం వ్యక్తం చేశారు. ఇటీవల కూటమి ప్రభుత్వం గృహ లబ్ధిదారులకు ప్రభుత్వం ఇచ్చే మొత్తంతో పాటు అదనంగా ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు 75 వేల రూపాయలు అదనంగా ఆర్థిక సహాయం చేస్తోందని చెప్పారు. ఎస్సీ, బీసీ, ఎస్టీ లబ్ధిదారులు ప్రభుత్వం అందించే నిధులతో త్వరితగతిన గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యం ప్రకారం గృహ నిర్మాణాలు పూర్తయితే కాలనీలో మౌలిక వసతులైన రోడ్లు, డ్రైనేజీ వంటివి ఏర్పాటు చేస్తారని చెప్పారు. గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె కాలనీలో తిరిగి అసంపూర్తిగా ఆగిన నిర్మాణాలు పరిశీలించి లబ్ధిదారులతో ముచ్చటించి సమస్యలు తెలుసుకున్నారు. హౌసింగ్ పీడీ పి.శ్రీనివాసప్రసాద్, ఎంపీడీఓ డి.జయమణి, డీఈ ఎస్‌వీవీ సత్యనారాయణ, ఏఈ ఓవీడీ పృథ్వీ, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు


పుష్పయాగంలో అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి


హోమంలో భక్తులు

టంగుటూరు: మండలంలోని జమ్ములపాలెంలో వేంచేసి ఉన్న శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్వామి వారికి వసంతోత్సవం, సాయంత్రం గుర్రం వాహనంపై గ్రామంలో ఊరేగింపు, రాత్రికి ధ్వజావరోహణ కార్యక్రమం నిర్వహించారు. చివరి రోజు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, అర్చనలు చేశారు. అర్చకులు మోహన్‌రావు ఆధ్వర్యంలో హోమం నిర్వహించి పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి ఏకాంత సేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

సమస్యలను గాలికొదిలేసిన ప్రభుత్వాలు


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ

పామూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాసమస్యలు, ప్రజల సంక్షేమాన్ని గాలికి వదలివేశాయని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నేపల్లి లక్ష్మీనారాయణ అన్నారు. సీపీఐ మండల 6వ మహాసభలు మంగళవారం స్థానిక గుజ్జుల యల్లమందారెడ్డి భవన్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కార్యదర్శి మన్నేపల్లి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తుంగలో తొక్కి కాలయాపన చేస్తున్నారన్నారు. శాంతిభద్రతలు ప్రశ్నార్థకంగా మారుతున్నాయని, ప్రజా సంక్షేమానికి పనిచేయాల్సిన ప్రభుత్వాలు ప్రతీకార రాజకీయాలు చేస్తున్న పరిస్థితులు చోటుచేసుకుంటున్నాయని, ఇది దురదృష్టకరమన్నారు. త్వరలో జరగనున్న సీపీఐ జిల్లా, రాష్ట్ర, జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రవీంద్రబాబు, నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ యాసిన్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్‌మౌలాలి, వజ్రాల సుబ్బారావు, సీపీఐ మండల కార్యదర్శి పోతల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన బేళ్లకే అధిక ధర


వేలం నిర్వహిస్తున్న నిర్వహణాధికారి సునీల్‌కుమార్


వేలాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

కొండపి: నాణ్యమైన బేళ్లకే అధిక ధర లభిస్తుందని కొండపి వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం వేలం సందర్భంగా రైతులకు ఆయన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేళ్లలో అన్య పదార్థాలు కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పొగాకును అనధికారికంగా అమ్మకాలు చేపట్టరాదన్నారు. మంగళవారం స్థానిక పొగాకు వేలం కేంద్రంలో నిర్వహించిన వేలంలో క్లస్టర్ పరిధిలోని ధర్మవరం , కోయవారిపాలెం, ముక్కోడిపాలెం, తాటాకులపాలెం, వెంకట కృష్ణాపురం గ్రామాలకు చెందిన రైతులు 692 బేళ్లను వేలానికి తీసుకొచ్చారు. అందులో 542 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 150 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ.280, కనిష్ట ధర కేజీ రూ.200, సరాసరి ధర కేజీ రూ.245.92గా నమోదైంది. వేలంలో 18 కంపెనీల వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

టంగుటూరు: రైతులు వేలం కేంద్రానికి తీసుకొచ్చే పొగాకు బేళ్లు (ఒక్కో బేదు) 150 కేజీలకు మించరాదని, అలాగే అన్యపదార్థాలు, న్యూస్ పేపర్లు లేకుండా తీసుకురావాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వేలంలో చింతలపాలెం, దావగూడూరు గ్రామాలకు చెందిన రైతులు 680 బేళ్లు వేలానికి తీసుకురాగా వాటిలో 542 కొనుగోలు చేశారు. 138 బేళ్లు తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280 పలకగా కనిష్ట ధర రూ. 205 పలికింది. సరాసరి రూ.253.82 ధర పలికింది. వేలంలో మొత్తం 23 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు


రేషన్ డీలర్లకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ మురళి

కొండపి: రేషన్ సరుకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పి.మురళి అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ సరుకుల పంపిణీపై రేషన్ డీలర్లకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 1 నుంచి ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ సరుకులు పంపిణీని షాపుల ద్వారా పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. రేషన్ డీలర్లు సమయపాలన పాటిస్తూ రేషన్ ప్రజలకు అందించాలని సూచించారు. రేషన్ పంపిణీలో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రేషన్ దుకాణాలు నిర్ణీత సమయం పాటిస్తూ నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం నిర్వహించాలన్నారు. ఈ–పాస్ మిషన్ వినియోగంపై డీలర్లకు శిక్షణ కల్పించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ శివరామకృష్ణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ సుధాకర్, మండలంలోని రేషన్ డీలర్లు పాల్గొన్నారు.